# మనిషి మనసు



కర్షకమిత్ర

"రాయిలాంటి మనిషి! అర్థాంతరంగా యిలా మంచంలో పడి తీసుకుంటున్నాడంటే ఏమనుకోవాలీ. చిత్రంగా వుంది, తల నెరవనన్నా లేదు, జవసత్వాలు ఉడిగిపోలేదు. నూరేళ్ళు నిండాల్సిన జీవితం పాపం అర్థాయుష్షులో అంతం అవుతుందా!"

అనుకుంటూ పాపయ్య పరిస్థితి తెలియగానే దూరపు బంధువులు వచ్చారు.

చుట్టాలూ, పక్కాలూ వచ్చారు.

ఊరవాళ్ళు వచ్చి చూసిపోతున్నారు.

కొడుకు కనిపెట్టుకుని చూస్తున్నాడు.

అల్లుళ్ళు కనిపెట్టి చూస్తున్నారు.

కోడలికన్నా కూతుళ్ళు పోటీ పడి మరీ సేవలు చేస్తున్నారు. మనవలూ, మనవరాళ్ళూ మంచం వదలడం లేదు. మధ్య మధ్య యినప్పెట్టె ఎక్కి ఆడుకుంటున్నారు.

అతని పేరుగలవాడే — మనవడు అతని చేతివి మురుగులు కన్నార్పకుండా సవరిస్తూ కూర్చున్నాడు.

అన్నదమ్ములు అంటే ముట్టనట్టు తప్పుకు తిరుగుతున్నారు.

పాపయ్య విన్నాడు — పగవాడికి పంటిలోనూ, సోదరుడికి కంటిలోనూ విషం వుంటుందని! అలా నమ్మాడు కూడాను.

పాపయ్య అంతర్యం నిండా ఆలోచనలు నోటిమాటరావటంలేదు. కొన్నాళ్ళుగా చూపులేదు. గతాన్నతడిమి చూసుకుంటున్న చూపులు అవి. ఆ చూపుల్లో ఇప్పుడు ధైర్యంవుంది.

రోజు రోజుకీ దిగజారిపోతున్నాడనీ, ఇంకా ఖరీదైన మందులేవో వాడాలి అనీ చాటుగా పిల్చిచెప్పి వెళ్ళిపోయాడు డాక్టరు.

డాక్టర్లు అలాగేఅంటారు. ఇక లాభం

లేదని పెదవి విరిచేశాడు పాపయ్య స్వంత కొడుకు.

పాపయ్య చూపు ఆనుతోంది. చెవులు వినిపిస్తున్నాయి శరీరంలో బాధ తెలుస్తోంది

తనకు తెలుసు! తన వాళ్ళందరికీ తనపై యింత ప్రత్యేకశ్రద్ధ ఎందుకో, జాలి ఎందుకో!

అతనికి మాట్లాడాలనివుంది. నోరు రావటం లేదు.

చివరికి పాషాణం యిచ్చయినా అతడిని తుది క్షణాల్లో మాట్లాడించే ఆలోచన అందరికీ వుంది. ఎవరికి ఏం చెపుతాడో అని అందరికీ ఆశ! అందుకే వారి నిరీక్షణ!! అది అతనికి మరింత బాగా తెలుసు!!!

కళ్ళ నిండుగా నీళ్ళు నింపుకుని. కడుపెడు దుఃఖాన్ని దిగమింగలేక మింగుతూ, నోటికి చెంగు అడ్డంపెట్టుకుని వచ్చి నిలబడింది అతని భార్య. అసలు పిల్లలు పుట్టని మొదటిభార్య ఆమె! పుట్టింట్లో వుంటోంది!

ఆమెను చూసయినా ఏదో చెపుతాడని ఆశపడ్డారు. గుర్తుపట్టావా? అనడిగారు.

గుర్తించినట్టు తలూపాడు అతను అతికష్టంమీద.

దుఃఖం ఆపుకోలేక భావురుమంది. లోపలికి పారిపోయి మెల్లిగా, బిగ్గరగా పేదరికం నాటి అతని నడత తల్చుకు తల్చుకుని చెప్పుకొని ఏడుస్తోందామె.

ఆయనవాళ్ళంతా చేరి ఓదారుస్తున్నారు.

ధనిష్టా పంచకాలు కూడా నట యింట్లో పోతే యిల్లు పాడుపెట్టాలిట. అంటూనే బయటపెట్టేశారు అతన్ని.

పాపయ్య కళ్ళుమూశాడు!

ఇంటిల్లి పాదీ గొల్లుమన్నారు.

నిజమే మరి! మనిషి పోతున్నాడని చూసిన మనుషులందర్నీ వేదాంతం ఆవరిస్తుంది. వైరాగ్యంలో 'బుద్బుదప్రాయమైన జీవితం - యిలానే మనమూ కళ్ళుమూస్తాం. ఇంతే.' అని బహుశా ఏడుస్తారు

అందరూ కన్నీళ్ళుపెట్టారు. అతని ఘనత చెప్పుకోవడం మొదలెట్టారు.

డాక్టరు వచ్చి నాడి చూశాడు ఉచ్ఛ్వాసనిశ్వాసాలు చూశాడు. తేలిగ్గా ఊపిరి పీల్చి వదిలాడు. గట్టిగానే 'ష్'అన్నాడు ముక్కుమీద వేలేసుకున్నాడు.

పాపయ్య పోయాడనుకున్న వాళ్ళ అజ్ఞానం మీద చిరాకుపడ్డాడు

పాపయ్య పోలేదు;

"నీరసంగా కళ్ళు మూసుకునుంటాడు. అంతే! పల్స్ బాగున్నాయి. హార్ట్‌బీట్ బాగానే వుంది మరేం ఫరవాలేదు ఈ ఇంజక్షను తీసుకురండి"- గ్యారంటీ యిచ్చి గ్లూకోజ్ ఇంజక్షను చేసి కూర్చున్నాడు డాక్టరు.

అతడి స్వంత ఇంట్లోనించి అతడిని వీధిలో పడేశారు. అతడు పోతాడని. ఇల్లు మైలపడుతుందనీను! పాపయ్య పోయాడనుకుని!!

అది తెలిసి బాధపడ్డాడు. దిగులుతో మూలుగుతూ పడున్నాడు పాపయ్య. కళ్ళు బరువుగా రెప్పలు మూతలు పడ్డాయి.

ప్రాయశ్చిత్తకాండ ఏకరువుపెడుతు

న్నారు పురోహితులు.

మామగారిచేత బ్రతికి వుండగా గోదానం చేయిద్దామని పాపయ్యఅల్లుడు ఆవుని తోలుకొచ్చారు.

పాపయ్య కళ్ళుతెరిచి చూసి మళ్ళీ మూసుకున్నాడు.

తను యిలాటి కర్రిఆవునే వరిచేలో పడిందని కర్రటాడితో బాదాడు. చెట్టుకి కట్టేసి బాదాడు. గిరగిరా తిరుగుతోందని ఆవుకి బంధాలువేసి మరీబాదాడు.తర్వాక రెండు రోజుల్లో నడుం విరిగి పోవడం వల్ల చచ్చిపోయింది ఆ ఆవు. తనే కొట్టాడు ఆవు వెన్నుపూస విరిగేలా.

ఆ ఆవు లాగే వుంది ఈ కర్రి ఆవు!

తను దానం చేయబోతున్నాడా?!

ఎన్నాటి ఉసురు తనకు తగిలిందో!

ఎన్నిటిని చంపలేదూ! కావాలని చంపాడు. చంపాలని చంపాడు. చంప కూడదు తప్పని చెప్పినా చంపాడు. చిన్నప్పుడు చీమల్ని తొక్కిచంపాడు. అల్లిబిల్లిల్ని ఆడించి చంపాడు. తూనీగల తోకలకి ఒకే దారం రెండుకొసలకి కట్టి ఆడించి చంపాడు.

ఊర కుక్కకి పిచ్చెక్కిందని సర దాకి నలుగురు కుర్రాళ్ళకిచెప్పి, దాని వెంటబడి కుర్రాళ్ళని వెంటేసుకుని తరిమి తరిమి దాని తల బద్దలుకొట్టి చంపాడు.

చిన్నప్పుడు సరదాకి చేసినా 'పాపం పాపం' అని మనసు పీకి పెద్దయ్యాక గుడి కట్టించాడు తను!

చిన్నతనంలో అల్లరిచేశాడు. బడి ఎగేశాడు. దొంగతనాలు చేశాడు. అబద్ధాలు చెప్పాడు. పిల్లల్తో పేచీలు. గిల్లికజ్జాలూ తెచ్చాడు.

ప్రాయంవచ్చాక ఆకతాయి కుర్రాళ్ళతోచేరి కల్లు తాగాడు. కల్లు తాళ్ళు ఎక్కిచాడు. చుట్టలు కాల్చడం నేర్చాడు. సారా తాగుడు నేర్చాడు, బూతులు నేర్చాడు. బూతులుతిట్టి ఆనందించడం నేర్చాడు.

కన్నుకొట్టడం నేర్చాడు. దొంగ చూపులు నేర్చాడు. అదను దొరికితే అమాయకమైన అమ్మాయిలని లోబరుచుకోడం నేర్చాడు.

తండ్రికి తెలిసి మందలిస్తే ఎదురు తిరగడం నేర్చాడు. తండ్రికి చెప్పి నందుకు అన్నదమ్ముల్ని తన్నడం నేర్చాడు.

తండ్రిపోతే పెద్దన్నతో పేచీ పెట్టి చరాస్తిలో, స్థిరాస్తిలో మేలు భాగాలు ఏరుకున్నాడు. పెద్దన్న మంచి తనాన్నీ, తమ్ముళ్ళ అమాయకత్వాన్నీ ఆసర చేసి కొని గట్టిగానే చేజిక్కించుకున్నాడు.

పేదింటి పిల్లతో మొదటి పెళ్ళి అయ్యింది, పెళ్ళాం వచ్చింది. పిల్లలు కలుగ లేదు. మళ్ళీ పెళ్ళాడాడు. పిల్లల్ని కన్నాడు. యిల్లు కట్టాడు. పిల్లల పెళ్ళిళ్ళు చేశాడు, పిల్లల పురుడు పుణ్యాలు చేశాడు.

కౌలు వ్యవసాయం చేశాడు. కౌలు గుత్తలు ఎగ్గొట్టాడు చిల్లర వరకాలు చేశాడు. కలివ్యాపారాలు చేశాడు. చేబదులుచేశాడు, అప్పులు చేశాడు ఎగ్గొట్టాడు.

భూములు కొన్నాడు. బంగారం కొన్నాడు, ఆస్తిపరుడయ్యాడు, ధన

వంతు డయ్యాడు, యింకా యింకా జాయింటు వ్యాపారాలు చేశాడు. మోసాలు చేశాడు. దగాలు చేశాడు. అన్యాయాలు చేశాడు. అక్రమాలు చేశాడు. చేసున్నట్టు ఎదుటి మనిషికి తెలియకుండా చేశాడు. అదేమని అడిగితే అడిగిన వాళ్ళ మీద పగవాడింట్లో పడి విస్తళ్ళు లేచిందల్లా లేవడమేననే పనులూ చేశాడు.

ఎన్నో చేసి సంపాదించాడు,

ఇపుడు తనవాళ్ళు తననేం చేశారు!! వీధిలో చింకిచాపమీదికి....

జీవిత పోరాటంలో విరామం. విశ్రాంతి లేకుండా తనుచేసిన యాగాలకీ, యజ్ఞాలకీ, యుద్ధాలకీ ఫలితంగా తనవాళ్ళకోసం తను ఆర్జించిన సంపదకి ఫలితంగా....నడివీధిలోకి!

ఇక తను బ్రతికితేనా! ఇంకా ఇంకా సంపాదించేసేవాడు!

ఇన్నాళ్ళూ లేమిలో వున్న జ్ఞాతుల్ని చెప్పుకునేవాడుకాదు. కలిమిలో వున్న తన దూరపు చుట్టాల్ని తనకు చాలా కావాల్సిన దగ్గరివాళ్ళని చెప్పేవాడు. కాని, యిపుడిక అలాకాదు. లేనివాళ్ళందరినీ గొప్పవాళ్ళని, ఆస్తిపరుల్ని, ధనవంతుల్ని చేసేసేవాడు.

అంతేనా! తను బ్రతికివుంటే-

గుళ్ళూ, గోపురాలూ, మందిరాలూ, భజనమండపాలూ. కట్టించేవాడే భక్తి ప్రవచనాలు చేయించేవాడే.

దానధర్మాలు చేసి ఊరు వాడ వాడలా పేరు తెచ్చేసుకునేవాడే!

వంశానికి, కులానికి, మతానికి పన్నెం, కీర్తి తెచ్చేసును తను!

కాగా —

కొన్నాళ్ళుగా తను మంచానపడి తీసుకుంటున్నాడు. రోగపీడితుడయ్యాడు.

వెనుకెపుడో అనిపించింది...

ఇపుడు తనవాళ్ళు తనను బయటపెట్టినపుడు అనిపించింది.

తన వలలో చిక్కుకొని ఆస్తిపాస్తులు తనకు శాకట్టుపాకట్టుచేసి ఓ కుటుంబం ముసలాళ్ళు బెంగతో భిక్షించుకుని తిండితిప్పలు మాని శుష్కించి చనిపోయినప్పుడు ...?

తన ఆకాంక్షతో తనే రాసిరంపాన పెడితే తన సతాయింపు భరించలేక తన రెండో భార్య బలవంతాన ఆత్మహత్య చేసికొన్నపుడు...?

ఆళ్ళ గోడువింటున్నా తనకు అనిపించిందా! లేదు!

భర్తకన్నా మిన్నగా మానప్రాణాలు అర్పించిన ఒకామెను తను వెళ్ళగొడితే జీవచ్ఛవంలా తనకు దూరమై భారంగా బ్రతుకుతున్నపుడు ....?

ఆ జీవచ్ఛవానికి తనవల్లే కలిగిన ఓ బిడ్డని తనస్వంతకొడుకు...!

అదిగో అపుడే ఏదో అనిపించింది మనసుకి.

చెయ్యెత్తు కొడుకుని ఎన్ని తప్పులు చేసినా తన కన్నకడుపు తీపితో భరించాడు. కాని, కోడలు ఎదుట మందలించబోయాడు. కొడుకుని న్యూనత పరిచాడు. కొడుకు-తన పేగులోని పేగు - తన సంపదకి ఏకైక వారసుడు-తననే తిరగబడి తన్నాడు! తన తప్పుల్ని దుయ్యబట్టాడు. అనరాని మాటలన్నాడు. చావమని, చంపుతానని అన్నాడు.

అప్పట్నించీ మంచంలోపడి తను తీసుకుంటున్నాడు. అపుడే అనిపించింది తను బ్రతక కూడదని ! తన వాళ్ళమీద మనసు విరిగిపోయింది

ఇపుడు తనవాళ్ళు బయటపెట్టేసి చాపమీద పడేసినప్పుడు మళ్ళీ అనిపించింది. తన వాళ్ళుతనను కాదు తన డబ్బునిమాత్రమే ప్రేమిస్తున్నారని! పదిమందీతనకుకాదుతనడబ్బుకేవిలువ ఇస్తున్నారని ! ఇక తను బ్రతకడం అనవసరం తను చనిపోవాలని.

కోపాలూ, తాపాలూ. కక్షలూ, కార్పణ్యాలూ, కావేశాలూ పెంచుకుని సాటిమనిషిని దోచుకుని ఆటలాడుతున్నాడు.

అంతే! అంతే! అంతే! అసహనంగా అయిష్టంగా అతని ఆలోచనలు రేగి అంతరాత్మ ఘోషిస్తోంది.

బొందిలో ప్రాణంపోయిందని కట్టెని పాడెమీదికి చేర్చేందుకు చివరి మజిలీగా చాపమీద పడేశారు.

తనదని ప్రాకులాడిన దేదీ తనది కాదని తెలిసిపోయింది అతనికి!

అలా తెలిశాక తను కలగన్న తన దైన జీవితానికి చావే ముగింపు చివరికి అని తెలిసింది.

ఏ జీవితానికైనా శాశ్వతమైన వీడ్కోలు చావు !

సుషుప్తిలో కన్న కలల్లాంటి వెన్నో

అనామిక




తన జీవిత సంఘటనలు! వాటికి ముగింపులు లేవు. వాటన్నిటికీ చావేముగింపు. ఇది నిజం.

చివరికి కొడుకునిపిల్చి చెప్పాలనిపించింది అతనికి –

నీతి నియమాలు ముఖ్యం అని. సత్ప్రవర్తనతో మసలమని, అత్యాశ పడొద్దని, అధిక సంపాదనకై మోజు పడొద్దని, దగాలూ, మోసాలు తో మంచి పేరిట వంచచెయ్యొద్దు మనుషుల్ని అని.

దేవుడికి మొక్కు. దేవతలకి మొక్కు మానవతని అణగదొక్కొద్దని.

మానవతా ధర్మం విడిచి మనిషి పెంచుకునే దంతా మనసు చేసే మాయ అని.

అరిషడ్వర్గాల పరిష్వంగంలో బందీ

అయి తను రాక్షసుడిగా ప్రవర్తించి, నలుగురి ఉసురూ తగిలి, అది తెలిసి తను మానసికంగా కృంగి మనసు కుళ్ళి కుళ్ళి మనోవేదనతో పీడింపబడుతున్నాను అని.

అతను చెప్పుకోవాలనుకున్నాడు.

అతడేమీ చెప్పలేకపోయాడు. నోరు పెగలడం లేదు

డాక్టరు మళ్ళీ ఇంజక్షను చేశాడు. అలాగే అక్కడే చూస్తూ కూచున్నాడు. అర్ధగంట తర్వాత మరోటి చేశాడు. మరో అర్ధగంటకి ఇంకోటి.

పాపయ్యకి ఇంజక్షను బాధ తెలిసింది. వత్తిగిలబోయాడు. మూలిగాడు. కళ్ళువిప్పాడు. చూపులు కదిలాయి. పెదవులు కదులుతున్నాయి కళ్ళు తడిశాయి.

డాక్టరు ధీమాగా అందర్నీ కలియజూశాడు.

"ఇంక ఫర్వాలేదు ఈ మందు వెయ్యండి. సాయంత్రం వచ్చి చూస్తాను." అంటూ మందిచ్చి వెళ్ళిపోయాడు.

బంధుగుల కళ్ళల్లో ఆనందంకన్న ఆశ్చర్యమే ఎక్కువ కనిపించింది.

సాయంత్రం డాక్టరు వచ్చేసరికి పరిస్థితి ఇంకాస్త మెరుగయ్యింది.

పదిరోజుల్లో పథ్యం పుచ్చుకుని లేచి తిరగడం మొదలెట్టాడు.



పన్నెండోరోజున ఊళ్ళోకే బయలుదేరాడు.

"ఎందుకు నాన్నా ఇంత నీరసంతో ఊళ్ళోకి వెళ్తావ్. ఇంట్లో అటూ ఇటూ తిరగ్గూడదూ" అన్నాడు కొడుకు.

"ఆ వెధవ నర్సిగాడు కిందటినెల్లోనే బాకీ తీర్చేస్తానన్నాడా .... ఏదీ... ఇలా లాభంలేదు ప్లీడరు నోటీసు ఒకటి యిప్పిస్తే గాని వాడు లొంగేట్టులేడు. అలా వెళ్ళి ప్లీడరుగార్ని ఓసారి కలిసి వద్దామని బయల్దేరాను" అంటూ చెప్పులు వేసుకొని మెట్లు దిగి వీధిలోకి వెళ్ళిపోయాడు.

పాపయ్య మాటలు అతని కొడుక్కిగాని, అటుగా పోతున్న ఆలకించిన ఆ వీధి చివరి నాగయ్యకుగాని కొత్తగా అనిపించలేదు. అసలు ఆ ఊళ్ళో వాళ్ళెవళ్ళు విన్నా ఆశ్చర్యపోరు ఎటొచ్చీ ఆశ్చర్యపోయిందల్లా పన్నెండు రోజుల క్రితం మంచంలో మూల్గిన పాపయ్య అంతరాత్మ ! అదికూడా ఒక్కక్షణం.



అనామిక